# దూరపు కొండల నునుపుదనం

( కథానిక )

అర్ధరాత్రి దాటిపోతోంది. సుశీల యింకా నిద్రపోలేదు. విద్యుద్దీప కాంతితో నిండిన హాలులో వాలు కుర్చీలో పడుకొని బాహ్య ప్రపంచంలోకి చూస్తోంది. అంతా చీకటి. చెట్లు, కొండలు, గుట్టలు, అన్నీ చీకటి ముసుగులో దాక్కున్నవి. ఎంతసేపు చూసినా ఏమీ కనపడలేదు. గాలి త్రోపుడుకి దొర్లుతున్న ఎండుటాకుల చప్పుడుతప్ప యింకేమీ వినిపించడం లేదు.

మేడ క్రింది వరండాలో బంట్రోతు కొండయ్య గుఱ్ఱుపెడుతున్నాడు. ఇంకెవరూ యింట్లోలేరు. ఎంతసేపటినుండి శూన్యదృక్కులను ప్రసరింప చేస్తోందో తెలియదు. విచారంతో ఉస్సురని వేడినిట్టూర్పులను విడుస్తోంది.

దభాలున తలుపు తోసుకొని లోపలికి వచ్చాడు చంద్రశేఖరం. భర్త వచ్చినా సుశీల లేవలేదు. అవసరంలేదని కాబోలు. మరొక ప్రక్కకు తలను త్రిప్పుకొని అలాగనే పడుకున్నది. శేఖరం బట్టలు మార్చుకొని, వేరొక కుర్చీలో కూర్చున్నాడు సిగరెట్టు కాలుస్తూ. అరగంటవరకూ ఎవరూ మాటాడలేదు. నిశ్శబ్దం హాలులో నాట్యం చేస్తోంది.

అంతవరకూ నిర్లక్ష్య భావంతో వేరొకవంక ముఖం త్రిప్పుకొని శూన్య ప్రపంచాన్ని తిలకిస్తూవున్న సుశీల భోరున ఏడ్చింది. శేఖరం తలెత్తి చూశాడు. మాటాడలేదు. కుర్చీనుండి లేవనూలేదు. ఎవరేపని చేసినా చేయకపోయినా నాపని నేను చేసుకుపోతానన్నట్టు చేతిలోని సిగరెట్టు కాలిపోతోంది.

కొంతసేపటికి సుశీల తేరుకొని అంది.

"వడ్డించమన్నారా?" అని.

ఆస్వరంలో క్రోధం, అసహ్యం, కాఠిన్యం మిళితమై వున్నాయి.

జవాబు లేదు.

"అడిగేది మిమ్మల్నే" అన్నది స్వరం హెచ్చిస్తూ.

"ఆకలిగా లేదు" అన్నాడు కటువుగా చేతిలోని సిగరెట్టును వేళ్ళమధ్య నలుపుతూ.

కట్టలు తెంచుకుని పైకుబుకుతున్న దుఃఖాన్ని మెల్లిగా అణచుకుంటోంది. ఎన్నో రాత్రులనుంచీ నిద్ర లేక పోవడం చేత కళ్లు లోతుకుపోయి నిప్పుకణాల్లాగ మెరుస్తున్నాయి.

భర్త దగ్గరనుండి యిటువంటి జవాబు రావడం ఇది క్రొత్తకాదు. రోజూ పరిపాటే. ఎన్నాళ్ళనిభరించగలదు యీఆవేదన. తీవ్రంగా ఆలోచిస్తోంది. "రోజురోజుకూ జీవితం దుర్భరం అయిపోతోంది. సంసార సుఖాన్ని పొందుదామని అందరూ వుబలాటపడతారు, నేనూ ఉబలాటపడ్డాను. ఎన్నోకలలు కన్నాను. పెళ్ళి అయింది. అన్ని సంసారాలూ స్వర్గతుల్యములుగా వుంటాయి. మాసంసారంలో నిప్పులు పోశాడు భగవంతుడు. నా జీవితం ఎడారి అయిపోయింది. కటిక చీకటితో నిండిన కాళరాత్రి అయిపోయింది."

కారే కన్నీటిని చీర చెంగుతో తుడుచుకుంది. ఎన్నిరోజులు ఓపిక పట్టినా యీ సమస్యతీరే సూచనలు కనుపించలేదు.

సిగరెట్టుమీద సిగరెట్టు ముట్టిస్తున్నాడు శేఖరం. ఆలోచనలు ఒకదానివెనుక ఒకటి దొర్లిపోతున్నాయి. కిటికీలోంచి అవతలికి చూస్తున్నాడు. వాలు కుర్చీలో కూర్చున్న సుశీల లేచివచ్చి అతనికి ఎదురుగా వున్న బల్లమీద కూర్చుని అడిగింది:

"నన్నిలా ఏడిపించడం మీకేమయినా బావుందా" దీనంగా అతని ముఖంలోకి చూసింది. ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

"నాతప్పేమిటో చెప్పండి. ఏమీ చెప్పకుండా నన్నెందుకిలా బాధపెడతారు?"

ఆయన మాట్లాడలేదు. కిటికీకి దగ్గరగా కుర్చీని లాగుకొని కూర్చున్నాడు. కాలిపోయిన సిగరెట్టును అసహ్యంతో అవతలకుపారవేశాడు.

సుశీల మొహం జేవురించింది. క్రోధం, కాఠిన్యం ఒక్కమారు విరుచుకుపడ్డాయి.

"నేనేమైనా అంటే మీకు కోపం గానీ, రాత్రి పన్నెండయినా యింటిమొహంచూడక పోతే యెలాగనండీ. ఇంట్లోవాళ్లు చచ్చేరో బ్రతికారో చూడనైనా చూడక్కరలేదా?"

"..........."

"మెల్లిగా అడిగితే మీకు వినిపించదు. గట్టిగా అడిగితే రిస్టు వాచీలూ, ఫౌంటెన్ పెన్నులూ మీద కెగురుతాయి."

దీనికికూడా శేఖరం జవాబు చెప్పలేదు. నీతో నాకు మాట్లాడవలసిన పనిలేదన్నట్టు మౌనవ్రతంపూని కూర్చున్నాడు. దుఃఖ భాజన మైన తన జీవితాన్ని తలుచుకుంటేనే దుఃఖం పొరలి వస్తోంది. హృదయం ద్రవించుకు పోతోంది.

పరిపరి విధాల పరుగులెడుతున్న మనస్సును పట్టుకొని అడిగింది మళ్ళా.

"ఇంటి యజమాని అన్నవారు, ఇంట్లో పరిస్థితులేఁవిటి, ఎవరెలా వున్నారు అని అడగనైనా అడగక్కర్లేదా?"

"మీనంత మనిషివి కంటికెదురుగా కని పిస్తూవుంటే అడగడంకూడా దేనికి"

అంతవరకూ మాట్లాడని శేఖరం నోటినుంచి యీమాటలు రాగానే ఆమె విస్తుపోయింది. మొహం ఎర్రబారింది.

"నిజమే, మీనులాగా వున్నానంటారు, దుక్కలాగ వున్నానంటారు. అనకేం. ఏదో కడుపుకి తిండిలేక, ఒంటికి బట్టలేక మీ యిల్లు చేరుకున్నాను. కట్టుకున్నతరువాత యిక తప్ప దురా భగవంతుడా అని మీరింత ముద్ద పారే స్తున్నారు"

ఏ విధంగా చూసినా ఆమె మనస్సుకు శాంతి లేదు. పట్టుపాన్పులమధ్య పవళించినా, మనసెప్పుడూ ముళ్లడొంకలలో నేమసలుతోంది. వాటి బారినుండి తప్పించుకుందామన్నా వీలు లేక పోతోంది. ముళ్లకో మెత్తదనం కూడానా!

"ఈ యింటికొచ్చి నేనేమీ సుఖపడి చావ లేదు. కాపరానికొచ్చిన దగ్గరనుంచీ ఒక్కలా ఏడిపిస్తున్నారు. ఒక్కనాడైనా ముచ్చటగా మాట్లాడిన పాపాన పోలేదు. ఎప్పుడుచూసినా ఏ పన్నెండింటికో యిల్లు చేరుకోవడం, ఆక లిగా లేదని మంచం వేపు చూడడం, తెల్లార కుండానే, "యింటికీ నాకూ యింతే సంబంధ మని" వెళ్ళిపోవడం. రెండేళ్ళ బ్రొద్దయింది. కాల్చుకు తింటున్నారు"

"అనవసరంగా దేనికీపేలాపన." అన్నాడు రుద్ర రూపంతో.

"మీ కెంగుకపసరమున్నతుందీ. నాదీ అవ సరం. నేనూ ఓ సంసారినే అని పుస్తిముక్క కట్టేరు. ఈ కూపంలో కుళ్లమని పడేశారు. ఎప్పుడూ నా ప్రాణం ఒక్కలాగనే హైరాన పడుతోంది"

లోపలవున్న దఃఖాన్నంతటినీ మెల్లిగా ఒలకపోస్తోంది. అతని చెవుల్లో ములుకుల్లాగ గుచ్చుకుంటున్నాయి. సిగరెట్టు పొగను తమా షాగా వదులుతూ కూర్చున్నాడు.

"ఇంతకీ నీ కిప్పుడేఁవిటి లోటయిందని యీయేడుపంతా? తిండిలేదనా బట్టలేదనా?"

"అన్నీ వుండబట్టే నాబ్రతుకిలావుంది. ఎన్ని వుంటేమాత్రం ఏఁవిటి లాభం, ప్రాణా నికి సుఖం లేకపోయినాక. డబ్బుంటేనేం పట్టు పాన్పులుంటేనేం తగలెయ్యడానికి.కొరుక్కొని తింటామా డబ్బును? లేక డబ్బుపెట్టి కొను క్కుంటే వస్తుందా సుఖం?"

"లేదు. జోలిపట్టి అడుక్కుంటే వస్తుంది."

కుర్చీలోంచి చివాలున లేచాడు. మొహం కందగడ్డలా వుంది. ఆ ధోరణిలోనే మాటలను విసురుతోంది సుశీల.

"అందులో వున్న సుఖం తల్లక్రిందులా పడి తపస్సుచేస్తే మాత్రం వస్తుందా. పట్టుపరుపు ల్లోనూ పాయసాన్నాలలోనూ సుఖం లేదు. మనసును గ్రహించి మసలే మనిషి దగ్గరుంది"

"ఇక నేం. నువ్వా బయలుదేరు, ఒక జోలి పట్టుకొని" అంటూవుండగానే చేతిలోని సిగ రెట్టు ఆమెమీద కెగిరింది.

ప్రక్కనున్న గదిలోకివెళ్ళి గభాలున తలుపు వేసుకున్నాడు. అలాగనే వాలుకుర్చీలో కూలబడ్డది సుశీల.

బాహ్యప్రపంచాన్ని అలముకున్న అంధకారానికీ తన జీవితానికీ భేదంలేదు. తెల్లవారే దాకా నిద్ర రాలేదు. కుర్చీలోనే వుండిపోయింది.

తెల్లవారింది. తొమ్మిది గంటలవందే లేవని అమ్మగారు మసకచీకటివుండగానే లేచిపోవడం చూసి పరిచారకులు ఎవరిపని వారు త్వరగా చేసుకుపోతున్నారు.

పెరటి వరండాలో సుశీల ముఖం కడుక్కుందికని పీటవేసి చెంబుతో నీళ్లు పెట్టింది రామి. సుశీల ముఖంలో కాంతి లేదు. నిర్జీవంగా వుంది.

దూరంగా బావిదగ్గర అంట్లు తోమడంలో లీనమయిపోయింది రామి. మొహం కలకలలాడుతోంది. దానిని చూడగానే యీర్ష్య రేకెత్తింది సుశీలలో.

జామిచెట్టుక్రింద రామి మొగుడు పిల్లాడిని ఒళ్లో పెట్టుకొని కూర్చున్నాడు. ఏవేవో పిచ్చి కబుర్లు చెబుతున్నాడు, చంటిపిల్లాడితో.

ఆ దంపతులను ఎంతసేపు చూసిందో తెలియదు సుశీలకు. నిశ్చేష్టురాలై కూర్చుంది, గంటలతరబడి.

"అమ్మా, అమ్మా" అంటూ పిల్లడు రెండు చేతులూ జాచుతున్నాడు, ఎత్తుకోమని. దూరం నుంచే ముద్దుపెట్టుకుంటున్నట్టు రామి పెదిమలు కలుపుతోంది.

సుశీల నోట్లోంచి బ్రెష్ జారిపోవడం ఆమెకు తెలియలేదు. ఆ దంపతులను కళ్లప్పగించి చూస్తోంది. అంట్లు తోముతున్న రామి చేతులు కడుక్కోకుండానే వచ్చి, "ఏఁవండమ్మగోరు అలావున్నారు, తలకాయ భారంగావుందా అమ్మా? డాకిటేరును తెప్పించమని బాబుగోరితో సెప్పమన్నారా" అంది ఆతృతతో.

అంతవరకూ చైతన్యం లేని సుశీల తేరుకొని, "అబ్బే ఏమీలేదే రామీ. నీకొడుకు ఆటలు చూస్తున్నాను. నీపని చూసుకో" అంది అసలు విషయాన్ని కప్పిపుచ్చుతూ.

"రామీ."

సుశీల పిలిచింది. సగం దూరం వెళ్ళిన రామి తిరిగొచ్చి "ఏఁవమ్మా" అంది ఆతృతతో.

కొంతసేపు వరకూ ఆలోచించి అడిగింది:

"అయితే రామీ, నీ మొగుడెప్పుడూ నీ వెనకాలే పిల్లాణ్ణి ఆడిస్తాడుగదా. మరి పనేమీ చెయ్యడటే."

"ఎందుకు సెయ్యడమ్మా. సేస్తాడు. దొరికినప్పుడల్లా కూలిపని సేస్తాడు. లేనప్పుడిలా కూకుంటాడు. ఉట్టినే కూకోని ఏంలాభమమ్మా" అంది రామి.

సుశీల కళ్ళు జామిచెట్టువేపు మళ్ళేయి. రంగడు తన భుజాలమీద పిల్లాణ్ణి వేసుకొని గెంతుతున్నాడు. పిల్లాడు పకాలున నవ్వుతున్నాడు. సుశీల చివాలున లేచి యింట్లోకి వెళ్ళిపోయింది.

* * *

ఇంటిపని పూర్తిచేసుకొని పదిగంటల వేళప్పుడు పిల్లాడి నెత్తుకొని అమ్మగారి దగ్గిరకొచ్చింది రామి. సుశీల కుర్చీలో కూర్చొని ఆలోచనలలో లీనమయింది.

"అమ్మా, మా బుల్లోడికి పాలచుక్కల్లేవు. పావలా డబ్బులిప్పించాలి. లేకపోతే సచ్చిపోతాడు తల్లీ." అంది రామి.

సుశీల తలెత్తి చూసింది.

"ఓరి యెదవనాగన్నా. అమ్మగోరికి దణ్ణమెట్టరా. డబ్బులిస్తారు."

చంటిపిల్లాడిచాత దణ్ణం పెట్టించింది. సుశీలకు చైతన్యం లేదు. చాలా పరాగ్గా వుంది. పిల్లాడు నవ్వుతూ చేతులు కలిపాడు. రామి సంసారసుఖం ఎంత తపస్సు చేసినా వస్తుందా అని అనుకుంటోంది సుశీల.

రూపాయి తీసి పిల్లాడి చేతిలో పెట్టింది. వాడు బోసినోటితో వెక్కిరించాడు.

పిల్లాణ్ణి భుజానవేసుకొని ముందు రంగడు, వెనకాల రామి నడుస్తున్నారు. కనురెప్ప వేయకుండా సుశీల వాళ్ళవేపే చూస్తోంది. వాళ్ళు గుడిసెలో దూరేరు. ఎంతసేపు అలా నిలుచున్నదో ఆమెకే తెలియదు.

ఆరోజల్లా సుశీల మనసు మనసులో లేదు. కాలుకాలిన పిల్లిలా తిరిగింది. నిరాశ, నిస్పృహలు వెంట తరుముతున్నాయి. ఆమె తట్టుకోలేకపోతోంది. రెండేళ్ళనుంచి యీ జీవితం అలవాటే. అయినా యీరోజున ఆవేదన అధికమయింది. గుండె మండిపోతోంది. జీవన

యాత్రకు యెడారి దిబ్బలు మిగిలి వున్నవి.

రాత్రి పన్నెండు దగ్గర. ఎప్పటిలాగనే సుశీల మేల్కొని వుంది. చిరునవ్వు మొహంతో శేఖరం లోపలికి వచ్చాడు. అన్నం వడ్డించమని తనంతట తనే అడిగాడు.

అన్నం వడ్డించి ఎదురుగా కూర్చుంది సుశీల. తినడానికి వుపక్రమించాడు.

శేఖరం సంతోషంగా వుండటం ఆమెలో ఆనందానికి బదులు యీర్ష్య జనించింది. కావలసిన సౌఖ్యాలన్నీ పొందుతూ, చింతా చీకూ లేనప్పుడు సంతోషంగా వుండక మరెలా వుంటారు. దౌర్భాగ్యురాలు. తనకంటే జీవితాన్ని భగవంతుడు దుర్భరం చేశాడు కానీ అందరూ అలాగే వుంటారా.

"ఇవాళండీ, రామికొడుకు ఎంత ముద్దొస్తున్నాడండీ. ఆ వెఱ్ఱినాగన్నను నా దగ్గిరకి తీసుకొచ్చింది రామి."

అంతవరకూ ఆయనముఖంలో తాండవించిన చిరునవ్వు మాయమైంది. సుశీల ఇంక వూరుకోలేకపోయింది.

"ఎవళ్ళని చూసినా ముచ్చటేస్తుంది. అదేం ఖర్మమో, దేవుడు నాకీ జన్మలో సుఖం రాయలేదు. క్రిందటి జన్మలో నిప్పులు పెట్టి పూజ చేశాను కాబోలు ఇలాంటి మొగుడు దొరకాలని"

"..............."

"రోడ్డుమీదపోయే ఏ భార్యా భర్తలని చూసినా ముచ్చటేస్తుంది."

"నా కంటే పనిమనిషి రామి నయం. సుఖంగా కాపరం చేస్తోంది, కూలి మనిషయితేనేం కాక. కలిగున్న కొంపలో కాపరం చేసే కన్న కష్టానికోర్చి పనిచేసే కూలివాడితో కాపరంచేస్తే నయం." అన్నది లోపలవున్న కోపాన్ని వెలిబుచ్చుతూ ఉబుకుతున్న దుఃఖాన్ని దిగమింగుతూ.

"అలా అయితే యేకూలివెధవనో కట్టుకోలేక పోయేవా? నాకోపంలో తయారయావ్య చిచ్చుపెట్టడానికి."

అన్నం తింటున్న కంచంలో నీళ్ళు దిమ్మరించాడు. చివాలునలేచి వెళ్ళిపోయాడు.

చాల సేపటివరకూ వంట యింటిలోనే కూర్చుండిపోయింది. తేరుకొని వచ్చి చూచేసరికి యింట్లో లేదు శేఖరం.

కిటికీదగ్గర నిలుచొని చూసింది రామి గుడిసె వేపు. గుడిసెలోంచి చిన్న వెలుగు పైకి వస్తోంది. రివ్వున మేడ మెట్లు దిగి గుడిసెను సమీపించింది. ఏవోమాటలు, మధ్య ఏడుపులు వినిపిస్తున్నాయి. వింటోంది.

"నేను తొలికాడనుండీ సెపుతూనే వున్నాను, ఏ యయ్యకాళ్ళో పట్టుకొని కూలి పని కుదుర్చుకోవయ్యా అని, ఇంటేనా, నా మాట"

చాల సేపటివరకూ ఎవరూ మాటాడలేదు. ఇద్దరిమధ్యా ఏదో కయ్యం వచ్చిందనుకుంది సుశీల.

"మన అమ్మగారయినా ఒక నాడిత్తారు. రెణ్ణాలిత్తారు. యెల్లకాలం అంటే యెక్కడొత్తాది? సీ. మనిసయినాక బుద్ధుండాల"

రంగడికి కోప మొచ్చినట్టుంది.

"నేనయితే కాళ్ళరిగి పోయేటట్టు తిరిగి కూలిపని యీమని అడుగుతానుగాని యీక పోతే నేనేం సేసేది" అన్నాడు.

"అలాసేసే, యిలా ముందరికి దెచ్చా, కొంపని. ఓరబ్బా అని అందరూ పన్లు సేసుకుంటూంటే నువ్వు పన్లే లేవంటావు. ఇంకేటి మండిపోతోందంటావు. మరయితే మమ్మల్నెలా పోసిత్తావో చూడు"

తరువాత గుడిసెలోంచి మాటలు వినిపించలేదు. రామి ఏడుపు ఎక్కువైంది.

"కూకుంటే కూడొత్తాదా ముంగటికి, మొగోడన్నవాడు సాధించుకు రావాలగాని. ఆడది సంపాయిత్తే తింటూ ఎన్నాళ్లు కూకుంటావు? వారంరోజు లయింది. పొయ్యిమీద కుండ సెక్కించలేదు."

"బలే. నేనోటి సెప్తాను యిను. కూడు నేకపోతే పోనీ ఆ పరమాతుముడే వున్నాడు. ఉన్నన్నాళ్లుంటాం. పోయినప్పుడు అదే పోద్ది ఆపాణం. ఎక్కడికని"

అన్నాడు రంగడు తెగించిన స్వరంతో. రామి వూరుకోలేదు.

"అంతేగాని పనికోసం నువ్వెక్కడికీ ఎల్ల

వన్న మాట."

రామి బోరని ఏడ్చింది. గుడిసె దద్దరిల్లింది.

గుడిసెలోంచి వినబడుతున్న మాటలు విని విస్తుపోయింది సుశీల. ఆ వేదన ఎక్కువైంది.

"యెదవబతుకు కూటికీ బట్టకీ కరువైపోనాక బతుకేటి, సీ. దేనికైనా పెట్టిపుట్టాల. బతగ్గానే సరా? బతుకంటే భాగ్యమంతులదే బతుకు. సుశీలమ్మగోరిని చూడు. ఇష్టమొచ్చిన తిండి, కంటికి నచ్చిన బట్ట. యింకేటి కావాల. ఇంతకీ ఆళ్లు పువ్వులెట్టి పూజసేసుకొన్నారు. ఇప్పుడింత తింటున్నారు."

ఏడుపు యింకా వినిపిస్తోంది.

"ఊరుకోయే. ఎందుకలా యేడుత్తావు" అన్నాడు రంగడు చికాగ్గా.

"ఊరుకోక సేసేదేం టుంటాను, లేదుగందా అని యేడవడం తప్ప. నారాతకి నువ్వేటి సేస్తావు. మొదట మాయయ్య ఉద్దోగస్తుడికే యిస్తానన్నాడు. కాని నారాతిలాగుండబట్టి నీకిచ్చాడు. నువ్వు పస్తులు పడుకోక్క బెడుతున్నావు."

"రాంవీ. నీకిప్పుడే సెపుతున్నాను. కూలి పని దొరకండే నీ మొగం సూత్తే ఒట్టు"

ఆఖరుసారి రంగడి మాటలు వినిపించాయి. రివ్వున గుడిసె దాటి వెళ్లిపోయాడు.

"రంగన్న మాంవా"

అని పెద్ద పెట్టున కేకపెట్టి అతని వెనకాలనే పరుగెత్తింది అంధకారంలోకి రామి.

మర్నాడు సుశీల పెరటిలో మొహం కడుక్కుంటోంది. రామి పనిలోకి రావడం ఆలస్యం అవడంచాత ఏంవంటారో అని భయపడుతూ బావి ప్రక్కగా నిలుచున్నది. మనిషి నీరసంగా కనుపించింది.

"అదేమే రామీ, అలా వున్నావు?" రామి జవాబు చెప్పలేదు. గుడ్ల నీరు నింపుకుంది.

# వ్యవసాయ విలువలలో మార్పు

యస్. వి. ఆర్. వేమూరి

గ్రామసంఘం యాజమాన్యం క్రింద వ్యవసాయ భూములు వున్నంత వరకు శిస్తు మదింపు అనేది కూడా గ్రామం మొత్తం మీద జరగడం అనేది మన ప్రాచీన గ్రామీణ వ్యవస్థలో ప్రధానపాత్ర వహించేది. గ్రామసంఘం, గ్రామనాయకుడూ, గ్రామపంచాయతీ ద్వారా ఈ మొత్తం శిస్తు చెల్లింపబడుతూ వుండేది. దీనివల్ల వ్యక్తిగతమైన కొన్ని లాభాలు, సదుపాయాలు కలిగేవి.

బ్రిటిష్‌వారి హయాములో శిస్తు మదింపు రైతువారీగా జరగడం ప్రారంభమై, గ్రామసంఘానికి పలుకుబడి లేకుండా చేయబడింది. దానివల్ల రైతుకూ ప్రభుత్వానికీ మధ్య సరాసరి సంబంధం ఏర్పడి, గ్రామసంఘం తన వ్యక్తిత్వాన్ని కోల్పోయింది.

పంటలు పండని కాలంలో, శిస్తు రద్దు కావడం, లేదా గ్రామసంఘంచే చెల్లింపబటడం అనేది కూడా పూర్వ సంప్రదాయం. ఒకవేళ పన్నులు చెల్లింపబడకపోయినా, భూమిపై గ్రామసంఘం యాజమాన్యానికి ప్రమాదం వుండేదికాదు. ఇప్పటి బ్రిటిష్‌వారి పద్ధతికింద శిస్తులు చెల్లింపబడినప్పుడు భూమిపై రైతు యాజమాన్యానికి ప్రమాదం ఏర్పడుతున్నది.

పండిన పంటలో ఇంత వంతు అనేది శిస్తుగా సాలుసరిని ఇదివరలో నిర్ణయించేవారు. ఇప్పుడు పంటలు పండినా, పండకపోయినా, సాగుచేసినా చేయకపోయినా, సాలీనా, నగదుగా, ఇంత మొత్తం, ఇన్ని వాయిదాలలో చెల్లించితీరాలనే పద్ధతి అమలులోనికి వచ్చింది.

దీనివల్ల భూముల అమ్మకం, తనఖాలు, వేలంపాటలు అనేవి రంగంలోకి వచ్చినవి. శిస్తు చెల్లించకపోవడం అనేదానివల్ల ఆస్థిపై స్వాధీనపు హక్కు కోల్పోవడమనే సరికొత్త ప్రమాదాన్ని కూడా మన ఆర్థిక వ్యవస్థలో బ్రిటిష్‌వారు ప్రవేశపెట్టారు.

పూర్వకాలంలో, గ్రామంలోని యావత్తు వ్యవసాయ భూములను కొన్ని కుటుంబాలవారు, అప్పటి సంప్రదాయాల ప్రకారం